క్లుప్తంగా...

నేడు కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: చెట్ల కొమ్మల నరికివేత కారణంగా పూడూర్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని శశిధర్‌రెడ్డి తెలిపారు. మునీరాబాద్ గ్రామంతో పాటు పరిసర ప్రాంతాల్లో ఉన్న గోదాంలు, పరిశ్రమలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని తెలిపారు.

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ శారదామనోధర్‌రెడ్డి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 9వ డివిజన్‌లో జరుగుతున్న సీసీ రోడ్డు పనులను కార్పొరేటర్ శారదమనోధర్‌రెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలోనే శరవేగంగా అభివృద్ధి చెందిందన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో అధికారులు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో బాలుడికి గాయాలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కేవిరెడ్డి నగర్ కాలనీలో వీధి కుక్కల దాడిలో రెండేళ్ల బాలుడికి తీవ్ర గాయాలపాలయ్యాడు. కేవి రెడ్డి నగర్ కాలనీకి చెందిన సంతోష్ కుమారుడు విశాంత్(2) బుధవారం ఉదయం ఇంటి ముందు ఆడుకుంటుండగా కుక్కలు బాలుడిపై ఎగబడ్డాయి. భయంతో బాలుడు పరుగులు తీయగా అప్పటికే ఓ కుక్క దాడి చేసింది. స్థానికులు, కుటుంబీకులు బాలుడిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కొంత కాలంగా కాలనీలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని ఫిర్యాదు చేసినా మున్సిపల్ అధికారులు, స్థానిక కౌన్సిలర్ వీణ సురేందర్‌గౌడ్ పట్టించుకోలేదన్నారు. వారి నిర్లక్ష్యం కారణంగానే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా స్పందించాలని కోరారు.

గ్రామ పంచాయతీ కార్మికుల సమ్మె షురూ



మేడ్చల్: తమ డిమాండ్ల సాధన కోసం గ్రామ పంచాయతీ కార్మికులు మొదలు పెట్టిన సమ్మె మేడ్చల్ మండల గ్రామాల్లో గురువారం ప్రారంభమైంది. గ్రామాల్లో కార్మికులు తమ విధులను బహిష్కరించి నిరసన తెలిపారు. మండల పరిషత్ కార్యాలయానికి చేరుకుని ఆవరణలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు తమ నిరసనను కొనసాగించారు. కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు అశోక్, కార్మిక నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

గౌడవెల్లిలో అంగన్‌వాడీ భవనం ప్రారంభం



అంగన్‌వాడీ భవనాన్ని ప్రారంభిస్తున్న హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్: దాతల సహకారంతో మండలంలోని గౌడవెల్లి గ్రామంలో నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని జెడ్పీలో కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. హెచ్‌ఎం క్లూస్ కంపెనీ సహకారంతో గ్రామంలో అంగన్‌వాడీ భవనం నిర్మించారు. దాతలు, పారిశ్రామికవేత్తలు ముందుకు వచ్చి తమ వ్యాపారాలు ఉన్న గ్రామాల అభివృద్ధికి నిధులు కేటాయించి గ్రామాలను అభివృద్ధి చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సురేందర్‌ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.

ఫైనల్ లేఅవుట్ ఇప్పించాలని వినతి

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని మూడో వార్డులో సర్వేనంబర్ 324, 359/పి, 361/పి, 362/పిలో చేసిన వెంచర్ ఫైనల్ లేఅవుట్ ఇవ్వకుండా వేధిస్తున్న వెంచర్ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ వేమనరెడ్డికి గురువారం బొక్క రవీందర్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. అలాగే లే అవుట్‌లో హనుమాన్ ఆలయానికి పెద్దల సమక్షంలో రాసిచ్చిన స్థలాన్ని మున్సిపాలిటీ స్వాధీనం చేసుకోవాలని, ఇల్లు నిర్మించుకుంటాం ఫైనల్ లేఅవుట్ కావాలని అడిగితే ఇవ్వడం లేదని ఫిర్యాదు చేశారు.



మేడ్చల్‌లో బాబూ జగ్జీవన్‌రాంకు నివాళులర్పిస్తున్న చైర్ పర్సన్ దీపికనర్సింహరెడ్డి



ఘట్‌కేసర్‌లో నివాళులర్పిస్తున్న చైర్ పర్సన్ పావనీయాదవ్, కౌన్సిలర్లు



చీర్యాల చౌరస్తాలో నివాళులర్పిస్తున్న ఎంపీపీ ఇందిరాలక్ష్మీనారాయణ తదితరులు



నాగారంలో మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు



మేడ్చల్‌లో జన్‌సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న బీజేపీ నేతలు

బాబూ జగ్జీవన్‌రామ్‌కు నివాళి

అణగారిన వర్గాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిన మహనీయుడు భారత మాజీ ఉపప్రధాని బాబూ జగ్జీవన్‌రాం వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలు మరువలేనివని, ఆయన అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో జగ్జీవన్‌రామ్ విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.



జవహర్‌నగర్‌లో బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, మహనీయుల ఉత్సవ కమిటీ సభ్యులు

అన్ని వర్గాల కోసం పనిచేస్తున్న ప్రభుత్వం

మంత్రి చామకూర మల్లారెడ్డి



గొర్రెలను పంపిణీ చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తున్న గొర్రెలను మంత్రి మల్లారెడ్డి గురువారం గొర్రెమేకల పెంపకందారులకు అందజేశారు. మండలంలోని గౌడవెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన యాదవులకు గొర్రెలను అందజేశారు. ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమం కోసం పని చేస్తోందని, కులవృత్తుల వారు గొప్పవారు కావాలనే ఉద్దేశ్యంతో సీఎం కేసీఆర్ గొర్రెల పంపిణీ పథకాన్ని అమలు చేస్తున్నారని తెలిపారు. మంత్రి మల్లారెడ్డి గొర్రెల పెంపకందారుల వేషం కట్టారు. చేతిలో కర్రపట్టుకుని నెత్తిపై గొంగడి వేసి కాసేపు గొర్రెలను కాశారు. కార్యక్రమంలో జిల్లా పశువైద్యాధికారి శేఖర్, ఏడీ కేశవసాయి, మండల అధికారి విశాల్, ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజవిజయానంద్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, మాజీ ఎంపీపీ పద్మజగన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ వెంకటేషం, నాయకులు రాజ్‌గోపాల్‌రెడ్డి, దయానంద్‌యాదవ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మూడోసారి కేసీఆర్ సీఎం..
రెండోసారి నేనే ఎమ్మెల్యే..

ఘట్‌కేసర్: సీఎం కేసీఆర్ మూడోసారి సీఎం అవుతాడు.. రెండోసారి పక్కా నేనే ఎమ్మెల్యే అవుతానని, ప్రజలు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మెరుగైన సేవలు అందిస్తున్నానని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అవుషాపూర్, అంకుషాపూర్, ఎదులాబాద్, ఘనాపూర్ గ్రామాల్లో సీసీరోడ్లు, డ్రైనేజీ పనులకు జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల స్టంట్ కాదని, మానవ సేవే మాధవ సేవగా భావించి ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నానని అన్నారు. గ్రంథాలయం సంస్థ జిల్లా అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, ఎంపీడీఓ అరుణారెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ వెంకటేశ్, సర్పంచులు కావేరి, జలజ, సురేశ్, ఉప సర్పంచులు ఐలయ్యయాదవ్, బాలమణి, లింగేశ్వర్, బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ భద్రారెడ్డి, మండల అధ్యక్షప్రధాన కార్యదర్శి రమేశ్, కొండల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు గోపాల్‌రెడ్డి, కుమార్‌ముదిరాజ్, రవి, రైతుబంధు జిల్లా సభ్యులు మంకయ్య, భిక్షపతిగౌడ్, మాజీ సర్పంచ్ సత్యనారాయణరెడ్డి, వేణుగోపాల్, మశ్చేందర్ రెడ్డి, ఎఫ్ఎస్‌సీఎస్ డైరెక్టర్ ధర్మారెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, వార్డు సభ్యులు బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



గొర్రె కాపరుల వేషధారణలో..



అవుషాపూర్‌లో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

అట్రాసిటీ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం



కలెక్టర్ అమయ్‌కుమార్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులతో పాటు వివిధ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం జరిగేలా సంబంధిత శాఖల అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అమయ్ కుమార్ అన్నారు. కేసులను కూడా వేగవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లాస్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ కేసులకు సంబంధించి ఎప్పటికప్పుడు చార్జిషీట్ దాఖలు చేయడంతో పాటు నిర్ణీత సమయంలోగా కేసులను పూర్తి చేసి బాధితులకు న్యాయం చేయాలని సూచించారు. అట్రాసిటీతో పాటు వివిధ కేసుల్లో పురోగతి తదితర వివరాలను సంబంధిత అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. అధికారులు సమన్వయంతో బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. గ్రామాల్లో కుల, సామాజిక బహిష్కరణలు విధించడంతో పాటు చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. బాధితులకు ప్రభుత్వం తరపున అందించాల్సిన ఆర్థిక సాయాన్ని సకాలంలో అందేలా చూడాలని పేర్కొన్నారు. కమిటీ సభ్యులు కూడా క్షేత్రస్థాయిలో అట్రాసిటీ అంశాలతో ముడిపడి ఉన్న ఘటనలను ఎప్పటికప్పుడు తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, డీసీపీ జానకి, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ చంద్రావతి, జిల్లా ఎస్సీ సంక్షేమ అధికారులు వినోద్, బాలాజీ, ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు రాజు, వస్తాద్, ధనరాజ్ నాయక్, సఫాయి కర్మచారి సభ్యులు వెంకటేశ్వర్లు, జిల్లాస్థాయి అధికారులు పాల్గొన్నారు.

పద్మశాలి సంఘానికి స్థలం కేటాయించాలి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో పద్మశాలి సంఘ భవన నిర్మాణం కోసం 500 గజాల స్థలాన్ని కేటాయించాలని కోరుతూ నాగారం మున్సిపల్ పద్మశాలి సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 ఏళ్లుగా నాగారం మున్సిపాలిటీ పరిధిలో సుమారు 500లకు పైగా పద్మశాలి కుటుంబాలు నివాసం ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నాయని అన్నారు. సంఘం సంక్షేమం కోసం 500 గజాల స్థలాన్ని కేటాయిస్తే పద్మశాలి సంక్షేమ సంఘం భవనాన్ని నిర్మిస్తామన్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన మంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షులు రమేష్, మధుసూదన్, ప్రధాన కార్యదర్శి చిలివేరి నర్సింగ్, సలహాదారులు వెంకటేష్, రవి, కందికట్ల లక్ష్మీనారాయణ, కోశాధికారి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



నాగారం మున్సిపల్ చైర్మన్‌ను కలిసిన పద్మశాలి సంఘం నాయకులు

ప్రధాన రహదారికి చకచకా మరమ్మతులు



నాగారం -కుషాయిగూడ ప్రధాన రహదారికి మరమ్మతులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో ముందుకెళ్తామని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలో నాగారం– కుషాయిగూడ ప్రధాన రహదారిలో శివాలయం సమీపంలో ప్రమాదకరంగా ఉన్న ప్రధాన రహదారిలో మున్సిపల్ ఆధ్వర్యంలో చేపట్టిన మరమ్మతు పనులను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారిలో కొన్నిచోట్ల గుంతలు ఏర్పడటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, మున్సిపల్ నిధులు వెచ్చించి మరమ్మతులు చేయిస్తున్నట్లు చెప్పారు. అనంతరం 13వ వార్డులోని దత్తాత్రేయ కాలనీలో సుమారు రూ.5 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న అంతర్గత మురుగు కాల్వ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు అన్నంరాజు సుమిత్రసురేష్ తదితరులు పాల్గొన్నారు.

రిస్క్ తీసుకుంటేనే ఉన్నత స్థాయికి..

మేడ్చల్‌రూరల్: ప్రతివ్యక్తి జీవితంలో రిస్క్ తీసుకుంటేనే విజయాలు సాధించి, ఉన్నత స్థానాల్లో నిలుస్తారని ఐఐఎం అహ్మదాబాద్ మాజీ బిజినెస్ కమ్యూనికేషన్ నిపుణుడు మాథ్యూ మోనిపల్లి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని ధృవ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో గురువారం ఎలా సంకెళ్లు వేసుకుంటాం.. మనం ఎలా విడిపోతాం అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. మాథ్యూ మోనిపల్లి ముఖ్య అతిథిగా పాల్గొని రిస్క్ టేకింగ్, కమ్యూనికేట్ అంశాలపై వివరించారు. రిస్క్ తీసుకునే వ్యక్తిగా ఉండటం వల్ల ప్రపంచం మన మెదడుకు ఆహారాన్ని ఇస్తుందన్నారు. మనల్ని మనం చిన్నచూపు చూసుకోకుండా స్వేచ్ఛగా కమ్యూనికేట్ చేసే ధైర్యం కలుగుతుందని తెలిపారు. కళాశాల వ్యవస్థాపక చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, యూఎస్‌ఏ అండర్సన్ ఆస్పత్రి ఎండీ అఖిలారెడ్డి, కళాశాల హెచ్‌ఆర్ హెడ్ ప్రియానాయుడు తదితరులు ఉన్నారు.



మాథ్యూ మోనిపల్లికి జ్ఞాపిక అందజేస్తున్న అఖిలారెడ్డి, ప్రతాప్‌రెడ్డి

నిధులివ్వాలని ఎమ్మెల్సీకి వినతి

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ నిధులు మంజూరు చేయాలని కోరుతూ గుండ్లపోచంపల్లి మున్సిపల్ పాలకవర్గ సభ్యులు గురువారం ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్సీ నివాసంలో ఆయనను కలిసి మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో వీధి దీపాల ఏర్పాటు, సీసీ రోడ్ల నిర్మాణం, అండర్ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్, కౌన్సిలర్లు దొడ్ల మల్లిఖార్జున్ ముదిరాజ్, జైపాల్‌రెడ్డి, హేమంత్ రెడ్డి, బాలరాజ్, కో ఆప్షన్ సభ్యులు చిన్నపురెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు సుధాకర్, జనార్దన్‌రెడ్డి, సురేందర్, వెంకటేశ్, ఫిలిప్స్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజుకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ పాలకవర్గ సభ్యులు

దృష్టిమరల్చి దోపిడీ చేసిన బాబాల అరెస్టు

ఉప్పల్: దృష్టి మరల్చి దోపిడీ చేసిన నిందితులను 24 గంటలు గడవక ముందే పోలీసులు అదుపులోకి తీసుకుని గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ గోవింద్‌రెడ్డి తెలిపారు. వివరాలు.. చిలుకానగర్ ఆదర్శనగర్‌లో బుధవారం బాబాల పేరుతో ఓ ఇంట్లోకి వచ్చిన ఇద్దరు వ్యక్తులు పూజలు చేస్తామని అనంతలక్ష్మీ అనే మహిళను నమ్మించారు. మాయమాటలు చెప్పి నగల మూటతో పారిపోయారు. బాధితురాలు ఉప్పల్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయగా పోలీసులు 24 గంటలు గడవకముందే దొంగ బాబాలను అదుపులోకి తీసుకున్నారు. వారు మీర్‌పేట ప్రాంతానికి చెందిన విబూతి రాములు(62) వృత్తి కూలి. మాదార్‌నగర్ మన్సూరాబాద్ ప్రాంతానికి చెందిన బాలనర్సింహ(58)లుగా గుర్తించారు. విబూతి రాములు గతంలో దృష్టిమరల్చిన కేసులో ఎల్‌బీనగర్ పీస్ పరిధిలో పట్టుపడి జైలుకు వెళ్లి వచ్చాడని పోలీసులు తెలిపారు. గురువారం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం



రూ.10 వేల ఆర్థికసాయం అందజేస్తున్న కందాడి శ్రీకాంత్‌రెడ్డి

కీసర: రాంపల్లిదాయర గ్రామ పంచాయతీ పరిధిలోని జేఎస్ఎంయూఆర్ కాలనీలో ఇటీవల అనారోగ్య కారణంగా మృతిచెందిన వెంకట్‌చారి కుటుంబ సభ్యులను గురువారం కీసర మండల బీఆర్ఎస్ సీనియర్ నేత, గ్రామపంచాయతీ వార్డు సభ్యుడు కందాడి శ్రీకాంత్‌రెడ్డి పరామర్శించి రూ.10 వేల ఆర్థిక సాయం అందజేసాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ఆదుకునేందుకు తాను ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ కందాడి శ్రీనివాస్‌రెడ్డి, వార్డు సభ్యులు ముక్క మహేందర్, మామిళ్ల చంద్రకళ, బొక్క విజయ, నేతలు సుదర్శన్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

న్యాయం కోసం మృతదేహంతో ఆందోళన



మృతదేహంతో ఆందోళన నిర్వహిస్తున్న మృతురాలి బంధువులు

మేడ్చల్‌రూరల్: తమకు న్యాయం చేయాలంటూ మృతదేహంతో కంపెనీ ఎదుట మృతురాలి కుటుంబ సభ్యులు ఆందోళన నిర్వహించిన ఘటన మేడ్చల్ పారిశ్రామికవాడలోని రాణే ఇంజన్‌వాల్స్ వద్ద చోటు చేసుకుంది. రాణే ఇంజన్ వాల్స్ కంపెనీ క్యాంటీన్ కాంట్రాక్టర్ కొట్టడంతో మనస్థాపం చెంది తమ కూతురు స్వప్న ఆత్మహత్యకు పాల్పడిందని, మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, మృతురాలి కుటుంబానికి న్యాయం చేయాలంటూ ఆందోళన చేశారు. మేడ్చల్ పోలీసులు ఘటన స్థలికి చేరుకుని వారిని సముదాయించారు. చివరకు మృతురాలి కుటుంబానికి పరిహారం చెల్లిస్తానని సదరు కాంట్రాక్టర్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మేడ్చల్: పట్టణంలోని 8వ వార్డులో మున్సిపల్ నిధులతో చేపడుతున్న అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహరెడ్డి శంకుస్థాపనలు, పూజా కార్యక్రమాలు చేశారు. వార్డు కౌన్సిలర్ నాగరాజుతో కలిసి పనులు ప్రారంభించారు. వార్డులో రూ.8 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు, రూ.4లక్షలతో నిర్మిస్తున్న డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. అన్ని వార్డుల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.



మయెరా కంపెనీలో బీఆర్‌టీయూ యూనియన్ ఏర్పాటు

మేడ్చల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మయె ఇండియా ప్రైవేటు లిమిటెడ్ కంపెనీలో కార్మికులు బీఆర్ఎస్ అనుబంధ బీఆర్‌టీయూ యూనియన్ ఏర్పాటు చేశారు. ఈమేరకు యూనియన్ పత్రాలను కార్మిక శాఖా అధికారులకు అందజేశారు. మయెర ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ పేరుతో నూతనంగా యూనియన్‌ను ఏర్పాటు చేశారు. గతంలో ఉన్న ఐఎన్‌టీయూసీ యూనియన్ పనితీరు బాగా లేకపోవడంతో బీఆర్‌టీయు యూనియన్‌ను ఏర్పాటు చేసున్నట్లు యూనియన్ ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, బీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ తెలిపారు.